సంపుటి :02 సంచిక :225 పేజీలు :06 వెల ₹5

# అక్షర దర్బార్

www.aksharadarbar.com Voice of the people

సోమవారం 03, నవంబర్ 2025



## సమన్వయంతో పని చేయాలి

- పంట నష్టపోయిన ప్రతి రైతుకు పరిహారం అందాలి
- జిల్లా కలెక్టర్ సత్య శారద

03



## బతికుండగానే మార్చురీకి..


ఐదురోజుల తర్వాత వ్యక్తి మృతి

05

## షాడో పోలీస్ హల్ చల్!

- పెట్రోలింగ్ వెహికిల్ డ్రైవర్ల ఓవర్ యాక్షన్
- అవసరం లేకున్నా సైరన్ వేసుకుంటూ రాష్ డ్రైవింగ్
- నేనే పోలీస్ అనేలా లాబీయింగ్ కు తెర
- బాధితులకు సైతం తప్పని బెదిరింపులు
- పట్టించుకోవాలంటున్న స్థానిక ప్రజానీకం

02



## రూ.122 కోట్లతో చేప పిల్లలు

- 20 వరకు లక్ష్యం మేరకు చెరువుల్లో విడుదల చేయాలి
- రాష్ట్ర పశు సంవర్ధక, మత్స్య శాఖ మంత్రి శ్రీహరి
- మత్స్యశాఖపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష

05






# కబళించిన మృత్యువు

## రంగారెడ్డి జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం

### ఆర్టీసీ బస్సుపైకి దూసుకెళ్లిన టిప్పర్


### ఇద్దరు డ్రైవర్లు సహా 19 మంది ప్రయాణికులు మృతి

- టిప్పర్‌లోని కంకర బస్సులో పడి కొందరికి గాయాలు
- దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన సీఎం రేవంత్‌రెడ్డి
- టిప్పర్ డ్రైవర్ ఓవర్ స్పీడే కారణమని సమాచారం

02


మరికొంత సమయంలో గమ్యస్థానం చేరుకుంటామనగా వారిని మృత్యువు వెంటాడింది. అదే వారికి కడపటి యాత్ర అయింది. రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండలం మీర్జాగూడలో సోమవారం ఉదయం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదం 19 మంది ప్రాణాలను కబళించింది. తాండూరు నుంచి హైదరాబాద్‌కు 70 మందితో బయలుదేరిన ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ బస్సును మార్గమధ్యంలో టిప్పర్ ఢీకొట్టింది. ప్రమాదంలో టిప్పర్ లోని కంకర బస్సులోకి పడటం, కొందరు ప్రయాణికులు దానిలో చిక్కుకోవడం, వెనుక సీట్ల వారికి స్వల్ప గాయాలు కావడం.. స్థానికులను భీతిల్లేలా చేసింది. - అక్షరదర్బార్, ప్రధానప్రతినిధి











# ఐఎంఏ రాష్ట్ర కమిటీలో మానుకోటకు డబుల్ ధమాకా!

- డా. రూప్ లాల్ కు రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ పదవి...
- 'బెస్ట్ బ్రాంచ్' అవార్డు కైవసం

అక్షర దర్బార్, మహబూబాబాద్ : ఐఎంఏ మహబూబాబాద్ శాఖకు రాష్ట్ర స్థాయిలో అరుదైన గౌరవం దక్కింది. ఆదివారం కరీంనగర్‌లో జరిగిన రాష్ట్ర ఐఎంఏ వార్షిక సమావేశంలో మహబూబాబాద్ శాఖకు చెందిన సీనియర్ సభ్యులు డా. బానోత్ రూపులాల్ రాష్ట్ర జాయింట్ సెక్రెటరీగా ఎన్నికయ్యారు. అదే సమయంలో, మహబూబాబాద్ శాఖకు 'బెస్ట్ బ్రాంచ్' అవార్డు కూడా దక్కింది. డా. బానోత్ రూప్ లాల్ రాష్ట్ర కమిటీకి ఎన్నిక కావడం పట్ల స్థానిక ఐఎంఏ శాఖ హర్షం వ్యక్తం చేసింది. ఆయన రాష్ట్ర జాయింట్ సెక్రెటరీగా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా మహబూబాబాద్ ఐఎంఏ శాఖ అధ్యక్షులు డా. నెహ్రూ, సెక్రెటరీ డా. సురేందర్, ట్రెజరర్ డా. వైదేహి సహా సభ్యులందరూ డా. రూపులాల్‌ను అభినందించారు.

## ఉత్తమ బ్రాంచ్ గా మహబూబాబాద్

గత సంవత్సర కాలంలో మహబూబాబాద్ ఐఎంఏ శాఖ నిర్వహించిన అనేక కార్యక్రమాలను గుర్తించిన రాష్ట్ర శాఖ, వారికి 'బెస్ట్ బ్రాంచ్ అవార్డు'ను ప్రధానం చేసింది. మహబూబాబాద్ శాఖ అధ్యక్షుడు డా. బాణోత్ నెహ్రూ, డా. రూపులాల్ ఈ అవార్డును ముఖ్య అతిథి, శాసనసభ్యుడు డా. కవ్వంపల్లి సత్యనారాయణ నుంచి అందుకున్నారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ఐఎంఏ అధ్యక్షుడు డా. ద్వారకానాథ్ రెడ్డి డాక్టర్ నెహ్రూ బృందాన్ని అభినందించారు.







# కబళించిన మృత్యువు

- రంగారెడ్డి జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం
- ఆర్టీసీ బస్సుపైకి దూసుకెళ్లిన టిప్పర్
- ఇద్దరు డ్రైవర్లు సహా 19 మంది ప్రయాణికులు మృతి
- టిప్పర్‌లోని కంకర బస్సులో పడి కొందరికి గాయాలు
- దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన సీఎం
- టిప్పర్ డ్రైవర్ ఓవర్ స్పీడే కారణమని సమాచారం

**అక్షరదర్బార్, ప్రధానప్రతినిధి:**

రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండలం మీర్జాగూడలో సోమవారం ఉదయం ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. ఆర్టీసీ బస్సు, టిప్పర్ ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు డ్రైవర్లు సహా 19 మంది ప్రయాణికులు మృతిచెందారు. తెలిసిన వివరాల ప్రకారం.. తాండూరు డిపోకు చెందిన ఎక్స్‌ప్రెస్ బస్సు 70 మంది ప్రయాణికులతో తాండూరు నుంచి హైదరాబాద్‌కు బయల్దేరింది. ఉదయం 7.05 గంటల సమయంలో చేవెళ్ల మండలం మీర్జాగూడ వద్ద ఎదురుగా వచ్చిన టిప్పర్‌ను ప్రమాదవశాత్తు ఢీకొట్టింది. ఘటనలో ఇద్దరు డ్రైవర్లు సహా 19 మంది మృతిచెందారు. పలువురు తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదం సమాయంలో బస్సులో 70 మంది ఉన్నారు. మృతుల్లో ఎక్కువ మంది తాండూరు, చేవెళ్లకు చెందినవారే. ప్రమాదం ధాటికి బస్సు కుడి వైపు పూర్తిగా నుజ్జునుజ్జు అయింది. బస్సు డ్రైవర్ వెనుక ఉన్న ఎనిమిది సీట్లు ధ్వంసమయ్యాయి. ఆ సీట్లలో కూర్చున్న ప్రయాణికుల దేహాలు ఛిద్రమయ్యాయి. టిప్పర్ పడిపోవడంతో అందులో ఉన్న కంకర బస్సులో పడిపోయింది. దీంతో కొందరు ప్రయాణికులు కంకరలో చిక్కుకుపోయి మరణించారు. వెనక సీట్లలో ఉన్న స్వల్ప గాయాలతో బయటపడ్డారు. కండెక్టర్‌తోపాటు ఎడమ వైపు ముందు సీట్లలో ప్రాణాలతో బయటపడగలిగారు. 19 మృతదేహాలను యంత్రాంగం పోస్టుమార్టం నిమిత్తం హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రికి తరలించింది.

### - టిప్పర్ డ్రైవర్ ఓవర్ స్పీడే కారణం

రోడ్డు ప్రమాదానికి టిప్పర్ డ్రైవర్ ఓవర్ స్పీడే కారణమని పోలీసులు ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చారు. లారీని ఢీకొట్టే ముందే ఎన్నో వాహనాలను ఓవర్ టేక్ చేసినట్లు గుర్తించారు. ప్రమాద స్థలానికి కొద్ది దూరంలో రోడ్డుపై గుంత ఉండడంతో తప్పించే ప్రయత్నంలో అదుపు తప్పి బస్సుపైకి దూసుకెళ్లినట్లు తెలుస్తోంది. ఆ సమయంలో టిప్పర్ 60 టన్నుల మేర కంకర ఉండడంతో కంట్రోల్ కాకపోవడంతో బస్సును ఢీకొట్టినట్లు కనిపిస్తోంది.

### - విచారణ ప్రారంభం

మృతుల కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు ప్రారంభించామని సైబరాబాద్ సీపీ మహంతి తెలిపారు. బస్సు, టిప్పర్ డ్రైవర్ల మృతితో తప్పు ఎవరిదనేది ఇప్పుడే చెప్పలేమని తెలిపారు. బస్సును ఢీకొనడంతో టిప్పర్‌లోని కంకర బస్సులో పడిందని, దీంతో ఒక్కసారిగా మృతుల సంఖ్య పెరిగిందని వెల్లడించారు. మృతుల బంధువుల విజ్ఞప్తి మేరకు చేవెళ్లలోనే శవపరీక్షలు నిర్వహిస్తున్నామని చెప్పారు. శవపరీక్ష పూర్తయిన తర్వాత మృతదేహాలను బంధువులకు అప్పగిస్తున్నామని వెల్లడించారు. ప్రమాదానికి కారణమైన టిప్పర్ డ్రైవర్‌ను ఆకాశ్ కాంబ్లేగా గుర్తించారు. మహారాష్ట్రకు చెందిన కాంబ్లే మహబూబ్‌నగర్‌కు చెందిన లచ్చానాయక్ వద్ద డ్రైవర్‌గా పనిచేస్తున్నారు. వీరు పటాన్‌చెరులోని క్రషర్ మిల్లు నుంచి వికారాబాద్‌కు టిప్పర్ వెళ్తున్నదని అధికారులు వెల్లడించారు.

### - మృతుల కుటుంబాలకు రూ.2 లక్షలు: పీఎం మోదీ

**ప్రమాదంలో ప్రాణనష్టం జరగడం చాలా బాధాకరం. బాధితులు, వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నా. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నాను. ప్రధానమంత్రి జాతీయ సహాయ నిధి నుంచి మరణించిన ప్రతి వ్యక్తి కుటుంబానికి రూ.2 లక్షల ప రిహారం అందిస్తాం. గాయపడిన వారికి రూ. 50,000 పరిహారమిస్తాం.**

### - రూ.5 లక్షల పరిహారం: మంత్రి పొన్నం

`బస్సు ప్రమాదంలో 19 మంది చనిపోయారు. మృతుల్లో పది మంది మహిళలు, ఎనిమిది మంది పురుషులు, ఒక చిన్నారి ఉన్నారు. 19 మందిలో 13 మృతదేహాలను పోలీసులు గుర్తించారు. వారి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుల కుటుంబాలకు రూ.5 లక్షలు, క్షతగాత్రులకు రూ. 2 లక్షల పరిహారం ప్రకటించాం. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందిస్తున్నాం' అని మంత్రి పొన్నం తెలిపారు. అలాగే మృతుల కుటుంబాలకు ఆర్టీసీ తరఫున రూ.2 లక్షల పరిహారం అందుతుంది.

### - ముగ్గురు అక్కాచెల్లెళ్లు మృతి

బస్సు ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు అక్కాచెల్లెళ్లు మృతిచెందడంతో తీవ్ర విషాదం నెలకొంది. తాండూరుకు చెందిన ఎల్లయ్య గౌడ్ ముగ్గురు కూతుళ్లు నందిని (డిగ్రీ ఫస్టియర్), సాయిప్రియ (డిగ్రీ థర్డ్ ఇయర్), తనూష (ఎంబీఏ) హైదరాబాద్‌లో చదువుకుంటున్నారు. ఇటీవల బంధువుల పెళ్లి ఉండటంతో ముగ్గురు సొంతూరుకు వచ్చారు. ఈరోజు తెల్లవారుజామున తిరిగి హైదరాబాద్ వస్తుండగా ప్రమాదం కారణంగా మృతిచెందారు. దీంతోకుటుంబ సభ్యులు కన్నీటిపర్యంతమవుతున్నారు. పోస్టుమార్టం అనంతరం తనూష, సాయిప్రియా, నందిని మృతదేహాలు గ్రామానికి చేరుకున్నాయి.

### - సీఎం రేవంత్ రెడ్డి దిగ్భ్రాంతి

రోడ్డు ప్రమాదంపై సీఎం రేవంత్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఘటనాస్థలిలో సహాయక చర్యలు ముమ్మరం చేయాలని కలెక్టర్‌ను ఆదేశించారు. ప్రమాద వివరాలను ఎప్పటికప్పుడు తెలియజేయాలని జిల్లా అధికారులకు సూచించారు. క్షతగాత్రులను హైదరాబాద్‌కు తరలించి మెరుగైన వైద్యం అందించాలని సీఎస్ రామక్రిష్ణారావు, డీజీపీ శివధర్‌రెడ్డిని ఆదేశించారు. అందుబాటులో ఉన్న మంత్రులు ఘటనాస్థలికి వెళ్లి పర్యవేక్షించాలని కోరారు. క్షతగాత్రులకు తగిన వైద్యం అందించేందుకు గాంధీ, ఉస్మానియా ఆసుపత్రుల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని సీఎం అదేశించారు.

# షాడో పోలీస్ హల్ చల్!

- పెట్రోలింగ్ వెహికిల్ డ్రైవర్ల ఓవర్ యాక్షన్
- అవసరం లేకున్నా సైరన్ వేసుకుంటూ రాష్ డ్రైవింగ్
- నేనే పోలీస్ అనేలా లాబీయింగ్ కు తెర
- బాధితులకు సైతం తప్పని బెదిరింపులు
- పట్టించుకోవాలంటున్న స్థానిక ప్రజానీకం



అక్షరదర్బార్, కాటారం: కాటారం సబ్ డివిజన్ పరిధిలో కొందరు ప్రైవేటు వ్యక్తులు షాడో పోలీస్ లా వ్యవహరిస్తున్నారు. ఆయా పోలీస్ స్టేషన్ లో అన్నీ తామై వ్యవస్థను శాసించే స్థాయికి ఎదుగుతున్నారు. పోలీస్ శాఖ మాటున ఆయా పనులకు వచ్చే బాధితులతో సెటిల్మెంట్లు చేసేందుకు సమయాత్తం అవుతున్నట్లుగా తెలుస్తోంది. అసలైన పోలీసులే ఫ్రెండ్లీ పోలీసింగ్ ఇంప్లిమెంట్ చేస్తూ ఫ్రెండ్లీగా మెలుగుతున్న కొసరైన ఆ షాడో పోలీసులు మాత్రం ఇష్టారాజ్యంగా నడుచుకుంటున్నట్లుగా ప్రచారం జరుగుతుంది. దీంతో షాడోలా వ్యవహరిస్తున్న ఆ వ్యక్తుల వల్ల పోలీస్ శాఖ ప్రతిష్టకే భంగం వాటిల్లే ప్రమాదం ఉందంటూ పలువురు అభిప్రాయపడుతున్నారు.

### - పెట్రోలింగ్ పేరుతో ఇష్టారాజ్యం


శాంతి భద్రతలు రక్షించే క్రమంలో పెట్రోలింగ్ చేస్తూ పరిస్థితులను చక్కదిద్దే ప్రయత్నం పోలీస్ శాఖ చేస్తుందనే విషయం అందరికీ తెలిసిందే. ఆ పెట్రోలింగ్ వెహికిల్స్ డ్రైవింగ్ చేస్తే వ్యక్తులు మాత్రం పెట్రోలింగ్ వ్యవస్థను ఆసరా చేసుకుని బెదిరింపులకు పాల్పడుతున్నట్లుగా సమాచారం. వారికి నచ్చని వ్యక్తులు ఎవరైనా ఉంటే వారి ప్రాంతాల వైపు పెట్రోలింగ్ చేయించడం వారికి నేరుగా వార్నింగ్ ఇప్పించడం ఆ డ్రైవర్లకే చెల్లుబాటు అవుతుందట. అంతే కాకుండా ఖాళీ సమయాల్లోని పెట్రోలింగ్ వాహనాలకు సైరన్ వేసుకుని రాష్ డ్రైవింగ్ చేస్తున్నట్లుగా ప్రజలు మాట్లాడుకుంటున్నారు. ముఖ్యంగా కాటారం పోలీస్ స్టేషన్ పరిధిలో చిన్న వయస్కుడైన ఓ యువకుడు నేనే పోలీస్ వెహికిల్ డ్రైవర్ ను అంటూ బెదిరింపులకు పాలొడుతున్నట్టుగా తెలుస్తోంది. మిగతా కొన్ని చోట్ల సైతం కొందరు వ్యక్తులు ఇలాగే ప్రవర్తిస్తున్నట్లుగా ప్రచారం జరుగుతున్నది. ఇప్పటికైనా వీరిని మొగ్గలోనే తెంచి మొక్కగా ఎదగకుండా పోలీస్ శాఖ ఉన్నంతధికారులు పట్టించుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

### - లాబీయింగ్ చేసేందుకు ప్రయత్నం

ఆయా పోలీస్ స్టేషన్లకు ఏదైనా సమస్యలపై వచ్చే బాధితులతో నాకందరు తెలుసని నేను చూసుకుంటానని ఆ షాడో పోలీస్ వ్యక్తులు నమ్మ బలికే ప్రయత్నం చేస్తున్నట్లుగా తెలుస్తోంది. ఈ క్రమంలోనే పోలీస్ శాఖలో కింది స్థాయి సిబ్బంది నుండి ఉన్నత స్థాయి అధికారితో మంచిగా ఉంటూ లాబీయింగ్ చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లుగా గుసగుసలు వినిపిస్తున్నాయి. దీంతో సెటిల్మెంట్లకే తెరలేపి అంతా చక్కదిద్దేలా రూపకల్పం చేసేందుకు సిద్దమైనట్లుగా ఇన్ఫర్మేషన్ అందుతుంది. ముఖ్యంగా కాటారం సబ్ డివిజన్ కేంద్రంలో ఓ యువకుడు యూత్ ని టార్గెట్ చేసి వారికో భయం కల్పించేలా వ్యవహరిస్తున్నట్లుగా సమాచారం. పోలీస్ వ్యవస్థను అడ్డం పెట్టుకుని బయట కాలర్ ఎగిరేస్తున్నట్లుగా సమాచారం. ఇప్పటికైనా సదరు యువకుడిని తప్పించి రాబోయే కాలంలో వచ్చే మచ్చ నుండి తప్పించుకునేలా సర్దుబాటు చర్యలు తీసుకోవాలని మేధావులు చర్చించుకుంటున్నారు.

## హరీష్ రావును పరామర్శించిన
# వీరేష్ రావు

అక్షర దర్బార్, పరకాల: తెలంగాణ మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే టి. హరీష్ రావు తండ్రి సత్యనారాయణ రావు ఇటీవల మృతి చెందిన నేపథ్యంలో పరకాల బీఆర్ఎస్ యువ నాయకుడు వీరేష్ రావు సోమవారం హరీష్ రావును కలిసి పరామర్శించారు. సత్యనారాయణ రావు ఆత్మకు శాంతి కలగాలని, కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని ఆకాంక్షించారు.



# ప్రజావాణి ఫిర్యాదుల పరిష్కారానికి కలెక్టర్ ఆదేశాలు

అక్షర దర్బార్, భూపాలపల్లి : ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలంటూ జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులు ఆదేశించారు. సోమవారం ఐడిఓసీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ప్రజలకు ప్రభుత్వ సేవలను మరింత దగ్గర చేయడం, సమస్యలను నేరుగా విని పరిష్కారం చూపడమే ప్రజావాణి లక్ష్యమని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా 44 మంది దరఖాస్తుదారుల సమస్యలను స్వయంగా విని, సంబంధిత అధికారులకు ఎండార్స్ మెంట్ జారీ చేశారు. దరఖాస్తులను సమయానికి పరిష్కరించడం అన్ని శాఖల బాధ్యత అని, అవసరమైతే అధికారులు స్వయంగా ఫీల్డ్ పరిశీలనలు చేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి , ఆర్డీఓ రవి, శిక్షణా డిప్యూటీ కలెక్టర్ నవీన్ రెడ్డి, జిల్లా శాఖాధికారులు పాల్గొన్నారు.








- పరకాల, భూపాలపల్లి ఎమ్మెల్యేలు రేవూరి, గండ్ర
- పరకాల మార్కెట్ లో సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రం ప్రారంభం

## సీసీఐ కొనుగోలు కేంద్రాన్ని
# సద్వినియోగం చేసుకోవాలి

అక్షర దర్బార్, పరకాల: పరకాల పట్టణ వ్యవసాయ మార్కెట్ లో సీసీఐ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పత్తి కొనుగోలు కేంద్రాన్ని సోమవారం పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి, భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు సంయుక్తంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రేవూరి మాట్లాడుతూ.. రైతులు సీసీఐ ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకొని మద్దతు ధరను పొందాలని సూచించారు. ప్రస్తుతం 8–12 శాతం తేమతో రైతులు నష్టపోతున్నారని, తేమ శాతం 20 వరకు అనుమతించాలని కేంద్రాన్ని కోరారు. అలాగే, ప్రతి ఎకరాకు 7 క్వింటాళ్ల పరిమితిని ఎత్తివేసి 12 క్వింటాళ్ల వరకు కొనుగోలు చేయాలన్నారు. తాజా వర్షాల వల్ల నష్టపోయిన రైతులకు పరిహారం అందించేందుకు కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం కృషి చేస్తుందని, అధికారులు వెంటనే సర్వే నిర్వహించి నివేదిక ఇవ్వాలని సూచించారు. అనంతరం కనీస మద్దతు ధర పోస్టర్‌ను ఆవిష్కరించారు.

### సీసీఐ కేంద్రాల్లోనే మద్దతు ధర :ఎమ్మెల్యే గండ్ర

అక్షర దర్బార్, చిట్యాల : రైతులు దళారులకు పత్తి విక్రయించి మోసపోవొద్దని, సీసీఐ కేంద్రాల్లోనే విక్రయించి కనీస మద్దతు ధర పొందాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. చిట్యాల శివారులోని శ్రీ బాలమురుగన్ ఇండస్ట్రీస్ కాటన్ మిల్లులో సోమవారం సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో పత్తి విక్రయించాలంటే తప్పనిసరిగా కిసాన్ యాప్ ద్వారా స్లాట్ బుక్ చేసుకోవాలని పేర్కొన్నారు.



# హరీష్ రావును పరామర్శించిన 'చల్లా'

అక్షర దర్బార్, పరకాల: మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు తండ్రి సత్యనారాయణ ఇటీవలే మృతిచెందగా హైదరాబాద్ లోని వారి స్వగృహంలో మాజీ మంత్రి హరీష్ రావును పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి పరామర్శించి సత్యనారాయణ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఆయన వెంట నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, యూత్ నాయకులు తదితరులు ఉన్నారు.

# సమన్వయంతో పని చేయాలి

- పంట నష్టపోయిన ప్రతి రైతుకు పరిహారం అందాలి
- జిల్లా కలెక్టర్ సత్య శారద



అక్షరదర్బార్, రాయపర్తి: ఇటీవల కురిసిన భారీ వర్షాల వల్ల రాయపర్తి మండలంలోని కొండూరు, ఉకల్ గ్రామాల్లో రైతుల వరి పంటలకు నష్టం వాటిల్లిన నేపథ్యంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద సోమవారం క్షేత్ర స్థాయిలో పర్యటించి నష్టాన్ని ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షాల కారణంగా పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకొంటుందని తెలిపారు. పంట నష్టంపై నిజమైన అంచనాలు వేయడానికి వ్యవసాయ, రెవెన్యూ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. రైతులకు సాయం అందించే దిశగా పంటనష్టం వివరాలను ఖచ్చితంగా నమోదు చేయాలని, అర్హులైన ప్రతి రైతుకు ప్రభుత్వం అందించే నష్టపరిహారం తప్పక అందేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. అనంతరం కొండూరు దుర్గా దేవాలయం వద్ద గల కాజ్ వే, ఉకల్ ఊర చెరువు కాజ్ వేలను పరిశీలించారు. ప్రతి మండలంలోని చెరువుల్లో నీటి సామర్థ్యం, నీటి ఇన్ అవుట్ ఫ్లో ఆధారంగా ప్రజల రాకపోకలకు కాజ్ వేల వద్ద అంతరాయం కలుగకుండా కాజ్ వే, బ్రిడ్జిల ఏర్పాటుకు ఇరిగేషన్, ఇంజనీరింగ్ అధికారులు సమన్వయంతో ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కలెక్టర్ సూచించారు. అంతకుముందు కొండూరు గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఇల్లంద ఏఎంసీ వైస్ చైర్మన్ కృష్ణారెడ్డి, డీఆర్డీఓ రామిరెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి అనురాధ, తహసీల్దార్ శ్రీనివాస్, వ్యవసాయ అధికారి వీరభద్రం, ఇరిగేషన్ ఏఈ బాలదాసు, స్థానిక ప్రజా ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.



# చలో ఢిల్లీ' ని విజయవంతం చేయాలి

అక్షర దర్బార్, వెంకటాపురం (నూగూరు): ఈనెల 17న జరగనున్న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు యాసం రమేష్ మాదిగ పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రంలోని ఆర్అండ్‌బీ గెస్ట్ హౌస్‌లో జరిగిన ఎమ్మార్పీఎస్ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ సీజేఐ గవాయిపై దాడిని తీవ్రంగా ఖండిస్తూ చలో ఢిల్లీ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ మరియు అనుబంధ సంఘాల కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉద్యమాన్ని విజయవంతం చేయాలని రమేష్ మాదిగ కోరారు. ఈ సమావేశంలో జిల్లా నాయకులు వేల్పుల మల్లేష్ మాదిగ, యాసం మహేష్ మాదిగ, వేల్పుల వెంకటేష్ మాదిగ, కొడారి సత్యం మాదిగ, చెన్నం రమేష్ మాదిగ, చెన్నం గౌతమ్, బలుసుపాటి చిరంజీవి, కుక్క శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# నాలా ప్రాంతాల్లో రిటైన్‌వాల్

- నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని నగర మేయర్ ఆదేశాలు
- కమిషనర్ చాహత్ బాజ్ పాయితో కలిసి కాకతీయ కాలనీల్లో పర్యటన

అక్షరదర్బార్, హనుమకొండ: ఆక్రమణలకు గురైన నాలా ప్రాంతాల్లో శాశ్వత ప్రతిపాదికన రిటైన్ వాల్ నిర్మాణాలు చేయడానికి చర్యలు చేపట్టాలని నగర మేయర్ గుండు సుధారాణి అధికారులను ఆదేశించారు. సోమవారం హన్మకొండ పరిధిలో వరద ముంపునకు గురైన ప్రాంతాల్లో కమిషనర్ చాహత్ బాజ్ పాయితో కలసి మేయర్ క్షేత్రస్థాయిలో కాకతీయ కాలనీ ఫేస్ 1, 2 ప్రాంతాల్లో పర్యటించి సమర్థవంతంగా చేపట్టుటకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ కాలనీ పరిసరాల్లో ఎన్ని గృహాలు వరద ముంపునకు గురైనా వాస్తవ సమాచారాన్ని పక్కాగా నమోదు చేయాలని ఎన్యూమరేటర్లకు సూచించారు. ఈ ప్రాంతంలో గల ప్రధాన నాలా జిల్లాస్థాయి కమిటీ ప్రతిపాదించిన విధంగా విస్తరణ చేయాలని, భౌతికంగా పరిశీలించి నాలా ఆక్రమణలు ఉంటే గుర్తించి రాష్ట్ర ముఖ్యమంత్రి ఇటీవల నగర పర్యటనలో ఆదేశించిన విధంగా అట్టి ఆక్రమణలను తొలగించి శాశ్వత ప్రతిపాదికన నాలా వెంట రిటైన్ వాల్ నిర్మించేలా చర్యలు చేపట్టాలని మేయర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ చీకటి శారద ఆనంద్, సీఎంహెచ్ ఓ డా రాజారెడ్డి, ఈఈ సంతోష్ బాబు, ఏఈ హరికుమార్ స్థానికులు తదితరులు పాల్గొన్నారు.





# మరిపెడ సీఐ దాతృత్వం

- 130 మంది విద్యార్థులకు సొంత ఖర్చులతో షూస్ వితరణ
- కృతజ్ఞతలు తెలిపిన విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు

అక్షరదర్బార్, మరిపెడ: మరిపెడ మండలం సీతారాంపురం పాఠశాలలో విద్యార్థులు షూస్ లేకుండా కాలి పాదాలతో పాఠశాలకు వెళ్తున్నారని సమాచారం అందుకున్న మరిపెడ సీఐ రాజ్ కుమార్ గౌడ్ వెంటనే పాఠశాలకు చేరుకున్నారు. పేదరికంలో ఉన్న పిల్లలను చూసి చలించిన సీఐ 130 మంది విద్యార్థులకు షూస్ తెప్పించి ఇచ్చి పిల్లల కళ్లలో ఆనందం చూశారు. పాఠశాలకు చేరుకొని పిల్లల పరిస్థితిని విని షూస్ వితరణ చేసిన సీఐకి ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.



# కాంగ్రెస్ నేతల పరామర్శ

**బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం, బియ్యం అందజేత**

అక్షర దర్బార్, దుగ్గొండి : మల్లంపల్లి గ్రామానికి చెందిన మాజీ విద్యా కమిటీ చైర్మన్ కక్కెర్ల రాజు తండ్రి కక్కెర్ల కిష్టయ్య ఇటీవల మృతి చెందగా, ఆయన కుటుంబాన్ని మండల కాంగ్రెస్ నాయకులు సోమవారం పరామర్శించారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు చుక్కా రమేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు రూ.2,500 ఆర్థిక సాయం, 50 కేజీల బియ్యం అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ బూరుగు రవీందర్, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కొత్తకొండ రవివర్మ, గ్రామ పార్టీ అధ్యక్షుడు మహ్మద్ సర్వర్, నాయకులు శంకేసి రమేష్, కొండపాక రవి, ఇందిరమ్మ కమిటీ సభ్యులు చుక్కా రాజేందర్, వెండి అనిల్, పరంగి బాబు, కక్కెర్ల కుమార స్వామి తదితరులు పాల్గొన్నారు.



# నాగరిగారి ప్రీతంను కలిసిన మడికొండ శ్రీను

అక్షర దర్బార్, పరకాల: హైదరాబాద్ లో ఏఐసీసీ ఎస్సీ సెల్ కమిటీ కో–ఆర్డినేటర్, తెలంగాణ ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్, టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్ నాగరిగారి ప్రీతంను సోమవారం ఎస్సీ సెల్ రాష్ట్ర కమిటీ వైస్ చైర్మన్ డాక్టర్ మడికొండ శ్రీను మర్యాద పూర్వకంగా కలిశారు. ఏఐసీసీ ఎస్సీ సెల్ కో–ఆర్డినేటర్ గా నియామకమైన సందర్భంగా ప్రీతంకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కన్వీనర్లు దబ్బేట రమేష్, అర్షం అశోక్, నత్తి కోర్నేల్ తదితరులు పాల్గొన్నారు.

# నకిలీ విత్తనాలపై రైతుల ఫిర్యాదు



గూడూరు అక్షర దర్బార్: నకిలీ విత్తనాలతో నష్టపోయామని గూడూరు మండలంలోని పొనుగోడు, రాములతండా, చిర్రకుంటతండా గ్రామాల రైతులు ఆరోపించారు. వరి పంట తాలు రావడంతో బాధిత రైతులు మండల వ్యవసాయ అధికారి అబ్దుల్ మాలిక్ కు ఫిర్యాదు చేశారు. ఈ విషయం జిల్లా అధికారుల దృష్టికి చేరడంతో మల్యాల కృషి విజ్ఞాన కేంద్రం వ్యవసాయ విశ్వవిద్యాలయానికి చెందిన శాస్త్రవేత్తలు డాక్టర్ దిలీప్, డాక్టర్ క్రాంతి సోమవారం బాధిత గ్రామాలను సందర్శించారు. శాస్త్రవేత్తలు పంట పొలాలను పరిశీలించి, నమూనాలు సేకరించారు. అనంతరం రైతులతో మాట్లాడిన వారు, "వరి పంటలో తాలు రావడానికి విత్తన నాణ్యత ప్రధాన కారణంగా వారు అనుమానించారు. నివేదికను హైదరాబాద్‌కు పంపించి, విత్తనాలపై ల్యాబ్ పరీక్షలు నిర్వహించి, రైతులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయ సంచాలకుడు మురళి, గూడూరు మండల వ్యవసాయ అధికారి అబ్దుల్ మాలిక్, స్థానిక రైతులు పాల్గొన్నారు.



# ఘనంగా చిట్యాల ఐలమ్మ విగ్రహావిష్కరణ





అక్షర దర్బార్ శాయంపేట : శాయంపేట మండలం కొప్పుల గ్రామంలో ఆదివారం వీరనారి చిట్యాల ఐలమ్మ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో వైభవంగా జరిగింది. వేడుకలకు అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య అధ్యక్షురాలు విమలక్క, కరీంనగర్ రిటైర్డ్ విద్యాశాఖ డైరెక్టర్ కొల్లూరు మల్లేశం హాజరయ్యారు. ముందుగా వారు అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం విగ్రహ దాత వైనాల రాజేందర్(రాజు) అధ్యక్షతన ఏర్పాటు చేసిన సభలో విమలక్క మాట్లాడుతూ.. ఐలమ్మ పోరాటస్ఫూర్తిని, ఆశయాలను కొనసాగించినప్పుడే వారి వారసులుగా మనం గుర్తింపు పొందుతామని అన్నారు. ఆపరేషన్ కగార్ అంటే నక్సలైట్లను మట్టు పెట్టడానికి, ఆదివాసీలను చంపడం కోసమో కాదు... ఆదివాసిలను అడవి నుంచి వెళ్లగొట్టి అక్కడున్న అపార ఖనిజ సంపదను కొందరికి కట్టబెట్టడానికి చేస్తున్న కుట్ర అని అన్నారు. ఎస్సీ , ఎస్టీ , బిసి మైనారిటీ ఆదివాసిలందరు ఒక్క తాటి పైకి వస్తే రాజ్యాధికారం మనదే అని అన్నారు. కార్యక్రమం నిర్వాహకులు విగ్రహ దాత వైనాల రాజేందర్ (రాజు), స్థలం దాత మాజీ జెడ్పిటిసి వంగాల నారాయణరెడ్డి, అసిస్టెంట్ ప్రొఫెసర్ రవికుమార్, అసిస్టెంట్ డైరెక్టర్ అలువాల రాజేందర్,సామల మధుసూదన్,కొమురయ్య, రాయరాకుల మొగిలి,కుమారస్వామి శంకర్ రవి, ఫైండ్ల మహేష్, కొమురాజు, శ్రీకాంత్, సీతారాములు, బగ్గి రమేష్, కులసంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఆసుపత్రిలో సమస్యలు పరిష్కరించాలి



అక్షర దర్బార్, భూపాలపల్లి : భూపాలపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో కొనసాగుతున్న సమస్యలను పరిష్కరించాలని బీఆర్ఎస్ నేతలు జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఇటీవల (27 అక్టోబర్) మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించి, అక్కడి సమస్యలను పరిశీలించి కలెక్టర్, సూపరింటెండెంట్‌ల దృష్టికి తీసుకెళ్లిన విషయం తెలిసిందే. అయితే వారం గడిచినా సమస్యలు పరిష్కరించకపోవడంతో, సోమవారం జిల్లా గ్రీవెన్స్ సెల్‌లో మరోసారి ఈ అంశంపై వినతిపత్రం సమర్పించారు. బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు కటకం జనార్ధన్ నేతృత్వంలో పార్టీ నాయకులు కలెక్టర్ రాహుల్ శర్మకు వినతి పత్రం అందజేశారు. ఆసుపత్రి సేవలు మెరుగుపరచి, పరికరాల లోపాలు, సిబ్బంది కొరతలను తక్షణమే తీర్చాలని వారు డిమాండ్ చేశారు.

# 42% రిజర్వేషన్ సాధనకు ఏకమవ్వాలి



చిట్యాల, అక్షర దర్బార్ : 42% రిజర్వేషన్ సాధన సమితి పిలుపుమేరకు చిట్యాల మండల కేంద్రంలో బీసీ–ఎస్సీ–ఎస్టీ జేఏసీ ఆధ్వర్యంలో తహసీల్దార్‌కి రిప్రెజెంటేషన్ సమర్పించారు. ఈ సందర్భంగా ముదిరాజ్ సంఘం రాష్ట్ర కార్యదర్శి చింతల రమేష్ మాట్లాడుతూ.. విద్య, ఉద్యోగాలు, స్థానిక సంస్థల్లో 42% రిజర్వేషన్ సాధనకు అన్ని వర్గాలు ఏకమవ్వాలి. రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాలు కొనసాగుతున్నాయి," అన్నారు. తొమ్మిదవ షెడ్యూల్లో బిల్లును చేర్చేందుకు కేంద్రంపై రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి తేవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో గౌడ సంఘం మండల అధ్యక్షుడు బుర్ర శ్రీధర్ గౌడ్, బీసీ,ఎస్సీ, ఎస్టీ జాక్ మండల కోఆర్డినేటర్ శీలపాక నాగరాజ్, అంబేద్కర్ యువజన సంఘం మండల అధ్యక్షులు జెన్నే యుగేందర్, నాయకులు పర్లపల్లి కుమార్, పుల్ల అశోక్, నేరెళ్ల రమేష్, కార్యదర్శి మట్టేవాడ కుమార్, గడ్డం కొమురయ్య, పోన్నం అశోక్ గౌడ్, ఎండీ రషీద్, గుర్రం శ్రీనివాస్, సంపంగి సతీష్, మాచర్ల దయాకర్ గౌడ్ మోత వెంకటేష్ పెరుమడ్ల నాగ రాజుగౌడ్ తదితరులు పాల్గొనడం జరిగింది.

# సింగరేణి యాజమాన్యం తీరుపై టీబీజీకేఎస్ ఆగ్రహం

**–సర్క్యులర్ ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్**

అక్షర దర్బార్, భూపాలపల్లి : సింగరేణి యాజమాన్యం తాజాగా కొన్ని గనుల వద్ద నెలలో 20 కంటే తక్కువ మస్టర్లు చేసిన కార్మికుల పేర్లతో పాటు, వారి కుటుంబ సభ్యులను కౌన్సిలింగ్‌కు రావాలని నోటీసు బోర్డులు పెట్టడం పట్ల టీబీజీకేఎస్ తీవ్రంగా ఖండించింది. భూపాలపల్లి టీబీజీకేఎస్ వైస్ ప్రెసిడెంట్ బడితల సమ్మయ్య, సెంట్రల్ జాయింట్ సెక్రటరీ రత్నం అవినాష్ మాట్లాడుతూ .. "ఇలాంటి చర్యలు కార్మికులను ప్రజా అవమానానికి గురిచేస్తున్నాయి. కుటుంబ సభ్యులను పిలవడం మానవతా విలువలకు విరుద్ధం" అని పేర్కొన్నారు. కొంతమంది ఆరోగ్య కారణాల వల్ల లేదా కుటుంబ అవసరాల వల్ల విధులు మిస్ అయినా, వారిని బోర్డుపై పేర్లతో చూపించడం అన్యాయం అని తెలిపారు. గుర్తింపు సంఘానికి తెలియకుండా సర్క్యులర్ జారీ చేయడం బాధాకరమని, ఇది గుర్తింపు సంఘం వైఫల్యమని విమర్శించారు. టీబీజీకేఎస్ యాజమాన్యాన్ని సర్క్యులర్‌ను వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేసింది. "కార్మికుల గౌరవం కోసం, న్యాయం కోసం టీబీజీకేఎస్ ఎల్లప్పుడూ ముందుంటుంది" అని నాయకులు స్పష్టం చేశారు.

# ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

అక్షర దర్బార్ శాయంపేట : శాయంపేట మండలం కొత్తగట్టు సింగారం గ్రామానికి చెందిన వ్యక్తి చెట్టుకు ఉరి వేసుకొని మృతి చెందాడు. ఎస్ఐ పరమేశ్వర్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ఆలేటి బుచ్చివీరు గత నెల 26న కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు 27న పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయగా పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. ఈ క్రమంలో బుచ్చివీరు ఈనెల 2న గ్రామ శివారులోని చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు గుర్తించారు. మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఎస్సై పరమేశ్వర్ తెలిపారు.

# బతికుండగానే మార్చురీకి..

## ఐదురోజుల తర్వాత వ్యక్తి మృతి

అక్షరదర్బార్, మహబూబాబాద్ : మహబూబాబాద్ జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో బతికున్న వ్యక్తిని గత నెల 29న వైద్యసి బ్బంది మార్చురీకి తరలించిన సంగతి తెలిసిందే. చాలా ఆలస్యం తర్వాత ఆ వ్యక్తి బతికి ఉన్నాడని గుర్తించి, వైద్యులు తిరిగి వైద్యం ప్రారంభించారు. ఐదు రోజులుగా ఆస్పత్రిలో చికిత్స పొందుతోన్న రాజు అనే వ్యక్తి సోమవారం మృతి చెందాడు. తెలిసిన వివరాల ప్రకారం చిన్నగూడూరు మండలం జయ్యారం గ్రామానికి చెందిన రాజు ఈ నెల 27న ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చాడు. అతడికి ఆధార్ కార్డు లేదన్న కారణంతో వైద్యసిబ్బందికి అతిడికి వైద్యాన్ని నిరాకరించారు. దీంతో ఎటు పోవాలో తెలియని రాజు మూడు రోజులుగా హాస్పిటల్ ఆవరణలోని క్యాంటీన్ వద్ద పడుకున్నాడు. వర్షానికి తడిసిపోయిన అతడు మార్చురీ సమీపంలో పడిపోయాడు. గమనించిన హాస్పిటల్ సిబ్బంది చనిపోయి ఉంటాడని భావించి మార్చురీ ఆవరణలోని గద్దెపై పడేశారు. అక్టోబర్ 30 ఉదయం స్వీపర్ మార్చురీని క్లీన్ చేస్తుండగా.. రాజు కదలడాన్ని గమనించి సెక్యూరిటీ సిబ్బందికి సమాచారం ఇచ్చింది. వారు వచ్చి విషయాన్ని డాక్టర్లకు చెప్పడంతో వెంటనే వార్డులోకి తరలించి చికిత్స మొదలు పెట్టారు. చికిత్స పొందుతూ చనిపోయాడు.

# కోత లేకుండా ధాన్యం కొనాలి

## - జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

## - కొడకండ్ల, పాలకుర్తి మండలాల్లో పర్యటన

అక్షరదర్బార్, పాలకుర్తి: మొంథా తుఫాన్ వల్ల ఇటీవల కురిసిన భారీ వర్షాలకి దెబ్బతిన్న పంటలను జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ సోమవారం క్షేత్రస్థాయిలో సందర్శించారు. కొడకండ్ల మండలం నర్సింగపురం, ఏడునూతల, పాలకుర్తి మండలం ముత్తారం గ్రామంలో దెబ్బతిన్న వరి, పత్తి, టమాట పంటలను కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నష్టపోయిన రైతులను ఆదుకునేలా క్షేత్రస్థాయిలో అధికారులు పని చేయాలన్నారు. వర్షాలకు దెబ్బ తిన్న పంటలను రైతు భరోసా అప్ ద్వారా పంట నష్ట నమోదును పక్కాగా చేయాలన్నారు. వీలైనంత త్వరగా పంట నష్టం నమోదు పూర్తి కావలన్నారు. మళ్లీ తుఫాన్ హెచ్చరిక నేపథ్యంలో రైతులు కోతకి వచ్చిన దాన్యాన్ని త్వరగా కొనుగోలు కేంద్రాలకి తరలించాలన్నారు. నర్సింగపురం గ్రామంలోని తిరుమల రైస్ మిల్లును కలెక్టర్ సందర్శించి ఎటువంటి తరుగు, కోత లేకుండా ధాన్యాన్ని కొనుగోలు చేయాలని రైస్ మిల్లు నిర్వాహకులను కలెక్టర్ ఆదేశించారు. ధాన్యాన్ని త్వరగా కొనుగోలు చేసి ట్యాగ్ చేసిన రైస్ మిల్ లకు తరలించాలని, ప్రతీ కేంద్రంలో సరిపడా టార్పాలిన్ లను అందుబాటులో పెట్టుకోవాలన్నారు.




# విద్యాసంస్థల సమీపంలో మద్యం షాపులను తొలగించాలి

## చిట్యాలలో విద్యార్థుల నిరసన



చిట్యాల, అక్షర దర్బార్ : విద్యాసంస్థల సమీపంలోని వైన్స్, బెల్ట్ షాపులను వెంటనే తొలగించాలి అని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేశాయి. సోమవారం చిట్యాల మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాల వద్ద విద్యార్థులతో కలిసి నిరసన నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ(ఎం-ఎల్) జిల్లా కార్యదర్శి మారేపల్లి మల్లేష్, వికెసి యూత్ రాష్ట్ర అధ్యక్షుడు అంబాల అనిల్ కుమార్, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి భూక్యా నవీన్ మాట్లాడుతూ.. "సుప్రీం కోర్టు ఆదేశాల ప్రకారం 500 మీటర్ల దూరంలోనే వైన్స్ షాపులు ఉండాలి. కానీ చిట్యాలలో నిబంధనలు ఉల్లంఘన జరుగుతోంది. అధికారులు చర్యలు తీసుకోవాలి," అన్నారు. చర్యలు తీసుకోకపోతే పెద్ద ఎత్తున విద్యార్థి ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో విద్యార్థులు కనకం హితేష్ .ఉదయ్. వినయ్ తదితరులు పాల్గొన్నారు.



# సీఎం క్షమాపణ చెప్పాలి

## బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ రవీందర్ రెడ్డి

## సైనికులపై అవహేళన వ్యాఖ్యలపై ఆగ్రహం

మొగుళ్లపల్లి, అక్షర దర్బార్ : జూబ్లీహిల్స్ ఉపఎన్నికల సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు భారత సైనికులను అవమానించేవిగా ఉన్నాయని, ఆయన తక్షణమే క్షమాపణ చెప్పాలి అని బీజేపీ భూపాలపల్లి నియోజకవర్గ కన్వీనర్ మోరే రవీందర్ రెడ్డి డిమాండ్ చేశారు. మొగుళ్లపల్లి మండల కేంద్రంలో బీజేపీ మండల పార్టీ అధ్యక్షుడు వేణుగోపాల్ రెడ్డి అధ్యక్షతన జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సీఎం దేశ సైనికుల త్యాగాన్ని అవహేళన చేయడం దుర్మార్గం. దేశంలోని అన్ని రాష్ట్రాలు, ప్రపంచ దేశాలు కూడా ఆపరేషన్ సిందూర్ పై నరేంద్ర మోదీ ప్రభుత్వాన్ని ప్రశంసిస్తున్న వేళ, తెలంగాణ సీఎం బాధ్యతా రహిత వ్యాఖ్యలు చేయడం బాధాకరం," అన్నారు. సమావేశంలో మాజీ మండల అధ్యక్షుడు చెవ్వ శేషగిరి, ఓబీసీ మోర్చా నాయకుడు జమలాపురం సాంబశివరావు, బండారి శ్రీనివాస్, అరకంతపు కృష్ణారెడ్డి, తెప్ప రాజు, రాష బిక్షపతి, బోయిని కుమారస్వామి, పొడిశెట్టి రవి, వెన్నంపల్లి శ్రీనివాస్, జమలాపురం రాజు తదితరులు పాల్గొన్నారు.



# హరీష్ రావును పరామర్శించిన నాగుర్ల

అక్షర దర్బార్, పరకాల: మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు తండ్రి సత్యనారాయణ రావు అకాల మరణం చెందగా సోమవారం ఆయన చిత్రపటానికి తెలంగాణ రాష్ట్ర రైతు రుణ విమోచన కమిషన్ మాజీ చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్లు నివాళులర్పించి, మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావును పరామర్శించారు. ఆయనవెంట తెలంగాణ రాష్ట్ర దివ్యాంగుల కో-ఆపరేటివ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ వాసుదేవారెడ్డి పాల్గొన్నారు.

# పరకాలలో దొంగల ముఠా హల్చల్

## ఐదుగురు ఆంధ్ర దొంగలను పట్టుకున్న పోలీసులు.

అక్షర దర్బార్, పరకాల: పరకాల పట్టణానికి చెందిన రవ్వ కావ్య ఆదివారం హనుమకొండకు వెళ్ళటానికి పరకాల బస్ స్టాండ్ వద్దకు వచ్చి బస్ కోసం ఎదురు చూస్తుండగా గుర్తుతెలియని దొంగలు ఆమె బ్యాగ్ లోని పర్సు, మొబైల్ ఫోను చోరీ చేసినట్లు పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసింది. ఈక్రమంలో పరకాల పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా అనుమానాస్పద ఐదుగురు వ్యక్తులు పట్నాల పూలమ్మ , కుంబ నాగమణి, యారసాని నాగమల్లి, యురుయుల సాయి కుమారి, యారసాని దేవి కనిపించడంతో వారిని పట్టుకుని విచారించగా రాష్ట్ర వ్యాప్తంగా పలు పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదైనట్లు గుర్తించి అదుపులోకి తీసుకొని రిమాండ్ కు తరచినట్లు పోలీసులు తెలిపారు.

# ప్రజా సమస్యలను పరిష్కరించండి

## అధికారులకు ఎస్పీ దిశానిర్దేశం

## ప్రజా దివస్ లో 16 ఫిర్యాదులు



భూపాలపల్లి క్రైమ్, అక్షర దర్బార్ : జిల్లా ఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా దివస్ కార్యక్రమంలో మొత్తం 16 ఫిర్యాదులు స్వీకరించబడ్డాయి. ఎస్పీ కిరణ్ ఖరే ప్రజల సమస్యలను విని, సంబంధిత అధికారులకు తక్షణ సూచనలు ఇచ్చారు. కొన్నింటిపై వెంటనే స్పందిస్తూ సంబంధిత పోలీస్ స్టేషన్ల సీఐలు, ఎస్ఐలతో నేరుగా మాట్లాడి, సమస్యల పరిష్కారానికి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ కిరణ్ ఖరే మాట్లాడుతూ.."ప్రజలు ఎలాంటి పైరవీలు లేకుండా, నిర్భయంగా పోలీస్ సేవలను వినియోగించుకోవాలి. చట్టబద్ధ పరిష్కారమే ప్రజలకు న్యాయం చేస్తుంది," అన్నారు. ప్రతి సోమవారం ప్రజా దివస్ ద్వారా ప్రజల సమస్యలను నేరుగా స్వీకరించి పరిష్కరించడం పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు.

# రూ.122 కోట్లతో చేప పిల్లలు

- రాష్ట్ర పశు సంవర్ధక, మత్స్య శాఖ మంత్రి శ్రీహరి
- మత్స్యశాఖపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష



అక్షరదర్బార్, హనుమకొండ: చేప పిల్లలు చెరువులకు చేరేలా అధికారులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర పశు సంవర్ధక, మత్స్య శాఖ మంత్రి వాకాటి శ్రీహరి సంబంధిత అధికారులకు సూచించారు. సోమవారం ఆయన హైదరాబాద్ నుంచి మత్స్య శాఖపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశానికి సమీకృత జిల్లా కలెక్టరేట్ నుంచి కలెక్టర్ స్నేహ శబరీష్ పాల్గొన్నారు. చేపల పంపిణీ టెండర్లు ఫైనల్ చేయడం, చేపల పంపిణీ పర్యవేక్షణ, ఇతర శాఖల అధికారుల నియామకం, యాక్షన్ ప్లాన్ తయారీ తదితర అంశాలపై రివ్యూ నిర్వహించిన మంత్రి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి వాకాటి శ్రీహరి మాట్లాడుతూ రూ.122 కోట్ల 22 లక్షలు ఖర్చు చేసి 83 కోట్ల చేప పిల్లలను ,10 కోట్ల రొయ్య పిల్లలను 26 వేల 357 నీటి వనరుల్లో పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. చేపలు పంపిణీ కార్యక్రమం ఇప్పటికే ఆలస్యమైందని, నవంబర్ 20 నాటికి నిర్దేశించుకున్న లక్ష్యం మేరకు నీటి వనరుల్లో చేప, రొయ్య పిల్లల విడుదల పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు. చేపల పంపిణీ కార్యక్రమం అమల్లో చాలా జిల్లాలు వెనుకబడి ఉన్నాయని, కలెక్టర్లు ప్రత్యేక దృష్టి సారించి నీటి వనరుల్లో చేప పిల్లల విడుదల కార్యక్రమం వేగవంతంగా పూర్తి చేయాలని, ప్రస్తుత సమయంలో నీటి వనరుల్లో చేపలు విడుదల చేస్తేనే మంచి ఫలితాలు వచ్చే అవకాశం ఉంటుందని అన్నారు. రాబోయే 18 రోజుల పాటు చాలా కీలకంగా ఉంటుందని అన్నారు. గతంలో ఉన్న అభియోగాలను పూర్తిగా తొలగించేలా పారదర్శకంగా ఈ కార్యక్రమం జిల్లాలో నిర్వహించాలని మంత్రి ఆదేశించారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో ప్రభుత్వ స్థలాలలో చేపల స్టాల్స్, ఫిష్ మార్కెట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. కలెక్టర్ స్నేహ శబరిష్ మాట్లాడుతూ యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసుకున్నామని, స్థానిక ప్రజా ప్రతినిధులకు సమాచారం ఇచ్చి చేపల పంపిణీ ఈ వారంలో ప్రారంభిస్తామని కలెక్టర్ తెలిపారు.




# మీ గొంతుక!
# మీ నమ్మకం!

## అక్షర దర్బార్

ప్రతి అక్షరం.. ప్రజా సంక్షేమం!

## ఎందుకు అక్షర దర్బార్?

- **నిజమైన వార్తలు** : నిష్పక్షపాతంగా, పారదర్శకంగా వార్తలను అందిస్తాం.
- **మీ సమస్యల పరిష్కారం** : స్థానిక సమస్యల నుండి ప్రభుత్వ పథకాల అమలు వరకు, మీ ప్రతి సమస్యను వెలుగులోకి తెస్తాం.
- **సమాజహితమే లక్ష్యం** : ప్రజల గొంతుకగా మారి, సామాజిక బాధ్యతతో పనిచేస్తాం.
- **ఈ-పేపర్ అందుబాటులో** : ఎక్కడ ఉన్నా, ఎప్పుడైనా మీ వార్తలను చదవండి.

**డిజిటల్ విప్లవంలో భాగంకండి!**

"అక్షర దర్బార్" ఈ-పేపర్ కోసం QR కోడ్‌ను స్కాన్ చేయండి.
వేగంగా, సులభంగా వార్తలను పొందండి.

**ప్రతిరోజూ మీ ఇంటికి, మీ మనసుకి చేరువగా "అక్షర దర్బార్"!**

## మీ నమ్మకమే మా బలం!

Printed, Published & Owned by VEMULA RAJESHWER RAO, printed at VR PUBLICATIONS, H.NO 7-1-364/16/A, Sriram Nagar, Padmakshi gutta colony, Hanamkonda, Pin 506001, Telangana State.
Editor : VEMULA RAJESHWAR RAO, Email : akshardarbarnews@gmail.com, Office No:7680992278 *RNI N0.TELTEL/2022/81915